పేకాట స్థావరంపై దాడులు

సిర్పూర్(టీ), సెప్టెంబర్ 26 : మండలంలోని చీలపల్లి అటవీ ప్రాంతంలో పేకాట స్థావరాలపై బుధవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. సిర్పూర్(టీ) ఎస్ఐ కమలాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ వెంకటేశ్ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించగా ఐదుగురు పేకాటరాయుళ్లను పట్టుకోగా 15 మంది పరారైనట్లు తెలిపారు. ఎల్ములే కమలాకర్, నల్లబోయిన బానేశ్, లింగడి నేహ్రూ, దుర్గం శ్రీకాంత్, దుర్గం పితాంబర్‌తో పాటు సలీం, వెంకటేశ్, దంద్రె మధుకర్, అజ్మేర మహేశ్, బొమ్మన శ్రీనివాస్, బండు, రాందాస్, ఎల్ములే రాజు, హీరాజీ, సంతోష్, గున్నాజీ, అశోక్, బోనగిరి నవీన్, ఎల్ములే దశరథ్, దంద్రె దశరథ్ ఉన్నారు. వీరి నుంచి రూ 46,600 స్వాధీనం చేసుకొని, 5 సెల్‌ఫోన్‌లు, 8 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

పాము కాటుతో రైల్వే కాంట్రాక్ట్ ఉద్యోగి మృతి

మంచిర్యాల అర్బన్, సెప్టెంబర్ 26: మంచిర్యాలలోని గోదావరి బ్రిడ్జిపై రైల్వే కాంట్రాక్ట్ వాచ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న అంతర్గాంకు చెందిన ఆకారపు సత్యనారాయణ పటేల్ గురువారం పాముకాటుకు గురై మృతిచెందినట్లు జీఆర్‌పీ ఎస్ఐ మహేందర్ తెలిపారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. మృతుడికి భార్య భారతి, కూతురు సుష్మిత ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి మృతి

సీసీసీ నస్పూర్, సెప్టెంబర్ 26: సీసీసీ నస్పూర్ తోళ్లవాగు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి పోరెడ్డి లక్ష్మారెడ్డి(75) మృతిచెందాడు. మంచిర్యాలలోని రెడ్డికాలనీలో ఉంటున్న లక్ష్మారెడ్డి శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే-7గనిలో ట్రామర్‌గా పనిచేశాడు. పదేళ్ల పాటు సింగరేణి వర్క్‌పీపుల్స్ స్పోర్ట్ అండ్ గేమ్స్ శ్రీరాంపూర్ ఏరియా కో ఆర్డినేటర్‌గా పనిచేశాడు. రిటైర్డ్ అయిన తర్వాత ఆయన కుటుంబ సభ్యులతో కలిసి మంచిర్యాలలో ఉంటున్నాడు. పనిమీద నస్పూర్‌లోని కలెక్టరేట్ వచ్చిన వెళ్తుండగా నస్పూర్ తోళ్లవాగు సమీపంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్నది. దీంతో ఆయన తలకు, చాతికి బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని మంచిర్యాల ప్రభుత్వ దవాఖానకు పోలీసులు తరలించారు. మృతుడికి భార్య సుజాత, కూతురు ఉంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సీసీసీ నస్పూర్ ఎస్ఐ సుగుణాకర్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ చోరీ

శ్రీరాంపూర్, సెప్టెంబర్ 26 : శ్రీరాంపూర్ కాలనీ వాటర్ ట్యాంక్ ఏరియాలో ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. వాటర్ ట్యాంక్ ఏరియాలో నివాసం ఉండే సింగరేణి రిటైర్డ్ కార్మికుడు మాలోత్ రాంజీ ఈ నెల 23న రాత్రి తన ఇంటి ముందు పార్కింగ్ చేశారు. ఉదయం లేచి చూసేసరికి తన మోటార్ సైకిల్ హీరో హోండా సీడీ 100 (టీఎస్ 22 3251) కనిపించలేదు. దీంతో శ్రీరాంపూర్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు రాంజీ తెలిపారు.

కండక్టర్ పై దాడి

భీమారం, సెప్టెంబర్ 26 డ్యూటీలో ఉన్న కండక్టర్ పై దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు అయిందని ఎస్ఐ రాములు తెలిపారు. బస్సులో గాదే భాస్కర్ కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. బుధవారం రాత్రి సిరోంచి నుంచి మంచిర్యాలకు వచ్చే క్రమంలో వేమనపల్లికి చెందిన సిడం మహేశ్ దాడి చేశారని తెలిపారు. బస్సులో ఉన్న ప్రయాణికులకు కూడా తీవ్ర ఇబ్బందికి గురి చేశారన్నారు. కండక్టర్ భాస్కర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గొర్రెల మందపై తోడేళ్ల దాడి

నెన్నెల,సెప్టెంబర్26: నెన్నెల మండలం కోనంపేట గ్రామానికి చెందిన కడారి ఐలయ్య చెందిన గొర్రెల మందపై తోడేళ్లు దాడిచేయడంతో 6 గొర్రెలు మృతి చెందాయి. గురువారం మేతకు వెళ్లిన గొర్రెలను సాయంత్రం ఊరు బయట మందలో ఉంచారు. మంద చుట్టు వల అడ్డుగా కట్టారు. ఈ క్రమంలో దాదాపు ఆరు తోడేళ్లు ఒక్క సారిగా మందపై దాడిచేసి ఆరు గొర్రెలను పట్టుకుని లాక్కెళ్లాయి. వాటిని తరిమివేసేందుకు ప్రయత్నించినప్పటికీ తమపై దాడికి యత్నించాయని కాపరి ఐలయ్య తెలిపారు. మృతి చెందిన గొర్రెల విలువ దాదాపు రూ.60 వేల వరకు ఉంటుందని ఐలయ్య ఆవేదన వ్యక్తం చేశాడు.

కోటపల్లిలో భారీ వర్షం

కోటపల్లి, సెప్టెంబర్ 26 : కోటపల్లి మండలంలో గురువారం భారీ వర్షం కురిసింది. గంటపాటు ఎడతెరిపి లేని వర్షం కురియగా వాగులు, ఒర్రెలు ఉప్పొంగి ప్రవహించాయి. నక్కలపల్లికి వెళ్లేదారిలో ఉన్న లోత్తొర్రె ఉప్పొంగి ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

మీడియా అక్రిడేషన్ గడువు పొడిగింపు

ఆసిఫాబాద్ టౌన్, సెప్టెంబర్26 : మీడియా అక్రిడేషన్ గడువు పొడిగిస్తూ కమిషనర్ పౌర సంబంధాల శాఖ గురువారం ఆదేశాలు జారీ చేశారు.సెప్టెంబర్ 30 వరకు ఉన్న గడువును తాజాగా డిసెంబర్ 31 వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా

కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

నస్పూర్, సెప్టెంబరు 26 : పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని కోరుతూ యూఎస్ఎఫ్ఐ నాయకులు విద్యార్థులతో కలిసి ర్యాలీగా వచ్చి గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలు గడుస్తున్నా విద్యార్థులకు స్కాలర్‌షిప్ చెల్లించడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకుంటే ప్రజాభవన్ ముట్టడిస్తామని జిల్లా కార్యదర్శి తిరుపతి, నాయకులు, విద్యార్థులు హెచ్చరించారు.

నేటి విద్యార్థి గర్జన సభను విజయవంతం చేయాలి

నస్పూర్, సెప్టెంబర్ 26 : పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని కోరుతూ శుక్రవారం హైదరాబాద్‌లో జరిగే విద్యార్థి గర్జన సభను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదునూరి అభివన్ తెలిపారు.

తాగునీటి సరఫరాలో ఇబ్బంది లేకుండా చూడాలి

జైపూర్, సెప్టెంబర్ 26: గ్రామాల్లో తాగునీటి సరఫరాకు ఇబ్బందులు లేకుండా చూడాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు అన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా మండల కేంద్రంలో నిర్వహిస్తున్న గ్రామ తాగునీటి సహాయకుల శిక్షణ కార్యక్రమానికి హాజరై పలు సూచనలు చేశారు. అనంతరం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం ద్వారా రైతు వేదిక సమీపంలోని పరిసరాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ విద్యాసాగర్, మండల పంచాయతీ అధికారి శ్రీపతి బాపురావు, తదితరులున్నారు.

విద్యా భారతి పాఠశాలకు డైనమిక్ స్కూల్ అవార్డు

అవార్డు అందుకుంటున్న విద్యా భారతి హైస్కూల్ డైరెక్టర్ శరత్‌కుమార్

తాండూర్, సెప్టెంబర్ 26 : విద్యాభారతి పాఠశాలకు 2024 సంవత్సరానికి గాను డైనమిక్ స్కూల్ అవార్డు లభించినట్లు పాఠశాల డైరెక్టర్ సురభి శరత్‌కుమార్ తెలిపారు. ఎడ్యుకేషన్ టుడే వారి ఆధ్వర్యంలో హైదరాబాద్ మాదాపూర్ ట్రిడెంట్ హోటల్‌లో బుధవారం జరిగిన డైనమిక్ స్కూల్ అవార్డుల ప్రదానోత్సవంలో ఈ అవార్డును జాకబ్ శేరాఫ్ చేతులమీదుగా శరత్‌కుమార్ అందుకున్నారు. ఈ సందర్భంగా శరత్‌కుమార్ మాట్లాడుతూ దేశవ్యప్తంగా 38 పాఠశాలకు ఈ అవార్డు అందినట్లు తెలిపారు. జాతీయ స్థాయిలో అవార్డు రావడానికి సహకరించిన విద్యార్థుల తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.

విశ్వనాథ ఆలయ హుండీ లెక్కింపు

మంచిర్యాల అర్బన్, సెప్టెంబర్ 26: మంచిర్యాల జిల్లా కేంద్రంలోని విశ్వనాథ స్వామి దేవస్థాన హుండీని గురువారం పర్యవేక్షణ అధికారి రాజమౌళి సమక్షంలో లెక్కించారు. ఆరు నెలలకు సంబంధించి 3 ఆలయాలకు కలిపి రూ.3,52,361 నగదు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి ముక్త రవి, ఆలయ అర్చకులు గోవర్ధన భట్టాచార్యులు, నరహరి శర్మ, బాలకృష్ణ శర్మ, మహిళా సేవాసమితి సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలి

మంచిర్యాల అర్బన్, సెప్టెంబర్ 26: గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలని, గో మహాపాదయాత్రను విజయవంతం చేయాలని అఖిల భారత ధర్మ ప్రచారసభ ప్రధాన కార్యదర్శి బేతి తిరుమల్ రావు కోరారు. గోవధను నిర్మూలించాలని, కలుషితమవుతున్న భూభాగాన్ని కాపాడుకోవాలని కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు బాలకృష్ణ గురుస్వామి చేపట్టిన గో మహాపాదయాత్రను హిందూ బంధువులందరూ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

గ్రామ పంచాయతీ ఏర్పాటు చేయాలి

కాసిపేట, సెప్టెంబర్ 26 : కాసిపేట మండలంలోని కొత్త వరిపేట, పాత వరిపేట, లచ్చనాయక్ తండా గ్రామాలను కలుపుతూ నూతన గ్రామ పంచాయతీ ఏర్పాటు చేయాలని కోరుతూ ఆ గ్రామస్తులు ఎమ్మెల్సీ దండె విఠల్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామస్తులు బానోత్ లక్ష్మణ్, బానోత్ సంతోష్, భూక్యా ఉమ్లానాయక్, జింజిరాల రాంచందర్, సాంబార్ రవి, జంజిరాల విష్ణుమూర్తి, గుండేటి నర్సయ్య, కడారి రాజు తదితరులు పాల్గొన్నారు.

పత్తి పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

మందమర్రి రూరల్, సెప్టెంబర్ 26:పత్తి పంటలో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయ అధికారి కల్పన సూచించారు. గురువారం మండల పరిధిలోని అమరవాది శివారులోని పత్తి చేలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. నార్లాపూర్, పులిమడుగు గ్రామాల్లోని వరి పొలాలను వ్యవసాయ విస్తరణ అధికారులు ముత్యం తిరుపతి, సయిండ్ల కనకరాజు పరిశీలించారు.

హామీలు మరిచి ప్రతిపక్షాలపై విమర్శలా ?

మంచిర్యాల (ఏసీసీ), సెప్టెంబర్ 26: కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిందని, ఇప్పుడు వాటిని అమలు చేయడం మరిచిపోయి, ప్రతిపక్షాలపై అనవసర ఆరోపణలు, విమర్శలు చేస్తూ కాలయాపన చేస్తున్నారని బీజేపీ నాయకులు మండిపడ్డారు. గురువారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో విలేకరులతో వారు మాట్లాడారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్‌పై కాంగ్రెస్ నాయకులు వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారని గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో విమర్శించారు. ఎల్లంపల్లి ముంపు బాధితులకు ఇవ్వాల్సిన నష్టపరిహారాన్ని ఇప్పటివరకు ఇవ్వలేదని, ఇప్పటికైనా అందేలా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతు రుణమాఫీని పూర్తి స్థాయిలో అమలు చేయాలని, నిరుద్యోగులకు రూ.4 వేల నిరుద్యోగ భృతి, రైతు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పల్లి రాకేశ్, బొలిశెట్టి అశ్విన్ రెడ్డి, కర్రె చక్రవర్తి, వంగపల్లి వెంకటేశ్వరావు, ముదాం మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఐఎంఏ అధ్యక్షుడిగా డా.పూజారి రమణ

పూజారి రమణ

మంచిర్యాల అర్బన్, సెప్టెంబర్ 26 : ఇండియన్ మెడికల్ అసోసియేషన్ 2024-25 సంవత్సరానికి గాను మంచిర్యాల జిల్లా నూతన అధ్యక్షుడిగా డా.పూజారి రమణ ఎన్నికయ్యారు. బుధవారం ఎన్నికల అధికారులు డా.రాంబాబు, డా.ఎం.సల్మాన్ రాజు, డా.ఆర్ రవిప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల్లో ఆయన విజయం సాధించినట్లు ప్రకటించారు. సెక్రటరీగా డా.విశ్వేశ్వర రావు, ట్రెజరరీ డా.స్వరూపారాణి, ఉపాధ్యక్షుడిగా డా.పద్మ, డా.ఎన్.శ్రీనివాస్, డా.ఆర్.రవిప్రసాద్, డా.ఎస్.నవీన్, డా.కళావతి, ప్రధాన కార్యదర్శులుగా డా.ఏ.జ్యోతి, డా.జే.సురేశ్‌కుమార్, డా.కుమార్ గౌడ్, డా.శ్రీలత, డా.రాకేశ్‌రెడ్డి, స్టేట్, సెంట్రల్ కౌన్సిల్, ఈసీ సభ్యులుగా పలువురు వైద్యులు ఎన్నికైనట్లు వారు తెలిపారు. మంచిర్యాల జిల్లా ఐఎంఏ అధ్యక్షుడిగా డా.రమణ ఎన్నికవ్వడం ఇది నాలుగోసారి. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు, వైద్యులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

చాకలి ఐలమ్మ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న కమాండెంట్, పోలీస్ బెటాలియన్ సిబ్బంది

కాగజ్‌నగర్‌లో వేడుకల్లో పాల్గొన్న సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా

చాకలి ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం

చాకలి ఐలమ్మ జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు, వీర వనిత చాకలి ఐలమ్మ జయంతిని గురువారం మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లోని అన్ని మండలాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు, రజక సంఘం, బీసీ సంఘాల నాయకులు నివాళులర్పించారు.

-నమస్తే నెట్‌వర్క్, సెప్టెంబర్ 26

ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పించిన జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస రావు

మందమర్రిలో చిత్రపటానికి పూలమాల వేస్తున్న రజక సంఘం నాయకులు

మంచిర్యాలలో చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

విచారణకు హాజరు కావాలి

- మరో సారి నోటీసులు జారీ చేసిన మున్సిపల్ అధికారులు

చెన్నూర్, సెప్టెంబర్ 26: చెన్నూర్ పట్టణంలోని సర్వే నంబర్ 840లోని (ప్రభుత్వ భూమి, బిలాదాఖల్)భూమిలో కొందరు ఇంటి నిర్మాణాలను చేపట్టగా మున్సిపాలిటీ అధికారులు ఇటీవల నోటీసులు జారీ చేశారు. అనంతరం వారికి మున్సిపాలిటీ వారు కేటాయించిన ఇంటి నంబర్లను మున్సిపాలిటీ రికార్డుల నుంచి తొలగించారు. శుక్రవారం మున్సిపాలిటీ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని మరో సారి మున్సిపాలిటీ అధికారులు వీరందరికీ గురువారం నోటీసులు జారీ చేశారు. ఈ భూమిలో కొన్ని సంవత్సరాల నుంచి కొందరు ఇండ్లను, షెడ్లను నిర్మించుకున్నారు. వారు నిర్మించుకున్న ఇండ్లకు మున్సిపాలిటీ నుంచి ఇంటి నంబర్లు కూడా పొందారు. అమృత పథకంలో భాగంగా వాటర్ ట్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన చేసే సమయంలో ప్రభుత్వ స్థలంలో ఇంటి నిర్మాణాలు జరిగాయని కలెక్టర్ కుమార్ దీపక్ దృష్టికి వచ్చింది. దీంతో ఆయన రెవెన్యూశాఖ వారిని విచారణకు ఆదేశించారు. రెవెన్యూ అధికారులు విచారణ చేసి ప్రభుత్వ భూమి అని తేల్చారు. దీంతో ఈ స్థలాల్లో ఇండ్లు నిర్మించుకున్న వారు తమ దస్తవేజులతో మూడు రోజుల్లో సమర్పించాలని మున్సిపాలిటీ వారు అప్పట్లో నోటీసులు జారీ చేశారు. అనంతరం మున్సిపాలిటీ రికార్డుల నుంచి వారికి కేటాయించిన ఇంటి నంబర్లను మున్సిపాలిటీ అధికారులు తొలగించారు. ఇదిలా ఉండగా ఈ స్థలంలో ఇండ్లు నిర్మించుకున్న వారు సరియైన దస్తావేజులతో మున్సిపాలిటీ కార్యాలయంలో శుక్రవారం విచారణకు హాజరు కావాలని మరోసారి నోటీసులు జారీ చేశారు. దీంతో పలు దఫాలుగా వారికి మున్సిపాలిటీ వారు నోటీసులు జారీ చేస్తుండడం పట్టణంలో చర్చనీయాంశమైంది.

ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి

రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ

పెంచికల్ పేట్, సెప్టెంబర్ 26 ప్రజలు ఫిర్యాదులతో పోలీస్ స్టేషన్ ను సంప్రదిస్తే త్వరగా పరిష్కరించాలని కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అధికారులను పరిశీలించి ఎస్ఐ కొమురయ్యకు తగు సూచనలు అందించారు. అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయనతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలో డీఐఈవో విచారణ

బెల్లంపల్లి, సెప్టెంబర్ 26 :ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో గురువారం డీఐఈవో అంజయ్య విచారణ చేపట్టారు. కళాశాల ఆవరణలో ఉన్న బీసీ బాలికల వసతిగృహానికి ప్రిన్సిపాల్ స్వరూప వెళ్లి విద్యార్థినులను అసభ్యకరంగా దూషించిందని విద్యార్థినులు, విద్యార్థి సంఘం నాయకులు డీఈఐవోకు ఫిర్యాదు చేయగా ఆయన విచారణ చేశారు. బాలికల వసతి గృహంలో బాలుర జూనియర్ కళాశాలకు సంబంధించిన విద్యార్థినులు, బాలికల జూనియర్ కళాశాలకు సంబంధించిన విద్యార్థినులు ఉంటారు. బాలుర జూనియర్ కళాశాల విద్యార్థినులపై చాలా అసహ్యంగా మాట్లాడుతోందని వారు ఫిర్యాదు చేశారు. దీంతో డీఐఈవో బాలికల, బాలుర జూనియర్ కళాశాల విద్యార్థినులతో వేర్వేరుగా మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. శుక్రవారం కూడా విచారణ కొనసాగుతతుందని డీఐఈవో తెలిపారు. ప్రిన్సిపాల్ స్వరూప, లెక్చరర్లతో విచారణ జరిగి తుది నివేదికను ఉన్నతాధికారులకు ఇస్తానని ఆయన వెల్లడించారు.

విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ

జన్నారం, సెప్టెంబర్ 26 :మండలంలోని చింతగూడలోని ప్రభుత్వ పాఠశాలలో 152 మంది విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన రిటైర్డ్ డీసీపీ ప్యాల మలహర్‌రావు, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ చెప్యాల రవీందర్‌రావు గురువారం స్పోర్ట్స్ దుస్తులు పంపిణీ చేశారు. వీటి విలువ రూ.75వేలు ఉంటుందని తెలిపారు.

రోడ్డు ఇలా..వెళ్లేదెలా ?

కొమ్మెరలో బురదమయంగా ఉన్న రోడ్డు

చెన్నూర్ రూరల్, సెప్టెంబర్ 26: చెన్నూర్ మండలంలోని కొమ్మెర గ్రామంలో వ్యవసాయ పనులకు వెళ్లే రహదారి చాలా అధ్వానంగా మారింది. చినుకు పడితే చాలు రోడ్డంతా చిత్తడి అవుతున్నది. బురద రోడ్డుపై రైతులు మహిళా కూలీలు వ్యవసాయ పనులకు వెళ్తున్న క్రమంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వైకుంఠ ధామం కూడా అటు వైపు ఉండడంతో గ్రామంలో ఎవరైనా మరణిస్తే అంత్యక్రియలు చేసేందుకు వెళ్లే వారు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ పట్టించుకొని రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కొమ్మెర గ్రామస్తుల కోరుతున్నారు.

ఇసుక రీచ్‌లను గుర్తించండి

నస్పూర్, సెప్టెంబర్ 26 : జిల్లాలో ప్రజల అవసరాలకు అనుగుణంగా ఇసుక రీచ్‌లను గుర్తించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌కార్యాలయంలో మైనింగ్, జిల్లా పంచాయతీ అధికారి, ఇతర అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన ఇసుక రీచ్‌ల నిర్వహణ వర్షాల కారణంగా నిలుపుదల చేసినట్లు తెలిపారు. ప్రజల అవసరాల మేరకు ఇసుక సరఫరా చేసేందుకు జిల్లాలో నూతన ఇసుక రీచ్‌లను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో మైనింగ్ ఏడీ జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు, తదితరులున్నారు.

విద్యార్థులు సన్మార్గంలో నడవాలి

భీమారం, సెప్టెంబర్ 26 విద్యార్థులు మంచి మార్గంలో నడువాలని, తల్లి దండ్రులకు, గ్రామానికి మంచి పేరు తేవాలని చెన్నూర్ కోర్టు జడ్జి రవి సూచించారు. భీమారం మండల కేంద్రంలోని స్థానిక కస్తూర్బా పాఠశాలలో మండల న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సును గురువారం నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ భూమన్న, న్యాయ వాదులు రాంబాబు, ఎస్‌వో కనకలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులను ముమ్మరంగా చేపట్టాలి

నీల్వాయిలో పారిశుధ్యపనులను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో గణపతి

వేమనపల్లి, సెప్టెంబరు 26 : వర్షాల దృష్ట్యా మండలంలోని అన్ని గ్రామాల్లో ముమ్మరంగా పారిశుధ్య పనులను చేపట్టాలని జడ్పీ సీఈవో గణపతి సూచించారు. గురువారం నీల్వాయి, కల్లెంపల్లి గ్రామాల్లో పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా నీల్వాయిలోని కేజీబీవీ పాఠశాలను తనిఖీ చేసి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పాఠశాలలో పరిశుభ్రత పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు సుదర్శన్, అశోక్, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. నీటి ట్యాంకులను శుభ్రం చేయాలని, ఉపాధి హామీలో కొత్త పనులను గుర్తించాలని, కొత్త నర్సరీల కోసం స్థలం ఎంపిక చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, ఏపీవో సత్య ప్రసాద్, ఈసీ మధుకర్, సాంకేతిక సహాయకులు, కార్యదర్శులున్నారు.

ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం ఫలితాలు

ఆసిఫాబాద్ టౌన్, సెప్టెంబర్ 26: జిల్లా కేంద్రంలో ప్రారంభమైన మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ చదువుతున్న మొట్టమొదటి బ్యాచ్ మొదటి సంవత్సరం ఫలితాలు విడుదలైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ సతీష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొత్తం 99 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 88 మంది ఉత్తీర్ణత సాధించారని, వీరిలో ఇద్దరు డిస్టింక్షన్ సాధించగా, 25 మంది ఫస్ట్ క్లాస్, 61 మంది సెకండ్ క్లాస్ సాధించారని, 11మంది ఫెయిల్ అయ్యారని పేర్కొన్నారు. అధ్యాపకులు లేక ఇబ్బందులు పడ్డ వైద్య విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించడంతో ప్రిన్సిపల్ సంతోషం వ్యక్తం చేసారు. భవిష్యత్‌లో మరింత మంచి ఫలితాలు సాధించేలా కృషి చేయనున్నట్టు వివరించారు.

గంజాయి కేసులో ఎనిమిది మంది అరెస్ట్

నెన్నెల,సెప్టెంబర్ 26: నెన్నెల సమీపంలోని చెరువు వద్ద కొందరు యువకులు నిషేధిత గంజాయి కలిగి ఉన్నారనే సమాచారం మేరకు నెన్నెల ఎస్ఐ ప్రసాద్ దాడి చేసి ఎనిమిది మందిని పట్టుకుని అరెస్ట్ చేసినట్లు బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం ఉదయం నెన్నెల సమీపంలోని చెరువు వద్ద కొందరు యువకుల వద్ద గంజాయి కలిగి ఉన్నారని సమాచారం అందింది. ఆ మేరకు అక్కడికి వెళ్లగా పోలీసులను చూసి యువకులు పారిపోయేందుకు యత్నించగా పట్టుకున్నారని తెలిపారు. ఏ1 నిందితుడైన మహ్మద్ ముస్తాఫా తాళ్లగురిజాల వద్ద 169 గ్రాముల గంజాయి రూ.3750 విలువైన కవర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మిగతా ఏడుగురు వ్యక్తులు ఏ 1 దగ్గర కొనేందుకు వచ్చినట్లు తెలిపారు. పోతురాజుల ఆకాశ్, ఘన్‌పూర్, శనిగారపు వినోద్ చర్లపల్లి, జాడి సుందర్ దుగ్నేపల్లి, దుర్గం స్వామి నెన్నెల, పిట్ట శేఖర్ నెన్నెల, రత్నం దేవేందర్ గుండ్లసోమారం, సల్లూరి రమాకాంత్ దెగ్నేపల్లి జమీల్ బెల్లంపల్లి వద్ద నుంచి 6 సెల్‌ఫోన్‌లు, 3 స్కూటీలు, 1 బజాజ్ బైక్‌లను స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు ఏసీపీ తెలిపారు. గంజాయి , ఇతర మత్తు పదార్థాలు వాడినా, కలిగి ఉన్నా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలొద్దీన్, ఎస్ఐ ప్రసాద్ ఉన్నారు.

గంజాయి రవాణా చేస్తే చర్యలు తప్పవు

బెల్లంపల్లి, సెప్టెంబర్ 26 : గంజాయి సేవించినా, రవాణా చేసినా, పండించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దీన్ హెచ్చరించారు. మండలంలోని బూదాకలాన్ గ్రామంలో పోలీసుల ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. పోలీస్ డాగ్‌తో గంజాయి సేవించిన అనుమానితులను తనిఖీ చేశారు. సంబంధిత ధృవీకరణ పత్రాలు లేని 30 ద్విచక్రవాహనాలు, 8 ఆటోలను సీజ్ చేశారు. అక్రమంగా నిలువ ఉంచిన రూ.9550 విలువైన మద్యం సీజ్ చేసి ముగ్గురిపై కేసులు నమోదు చేశారు. అనంతరం సీఐ మాట్లాడుతూ యువత గంజాయి సేవించి తమ విలువైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దని సూచించారు. గ్రామంలో చట్ట వ్యతిరేక కార్యక్రమాలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాళ్లగురిజాల, టూటౌన్ ఎస్ఐలు రమేశ్, మహేందర్ పాల్గొన్నారు.

నిందితుల అరెస్ట్ చూపుతున్న ఏసీపీ రవికుమార్

న్యాయం చేయాలి

- రైతుల ఆందోళన

ఆందోళన చేస్తున్న రైతులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా

కాగజ్‌నగర్, సెప్టెంబర్ 26: సిర్పూర్ (టి) మండలంలోని ఇటికల పహాడ్ రైతులు కాగజ్‌నగర్ పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట గురువారం ఆందోళన చేపట్టారు. పోడు భూములకు పట్టాలు ఇప్పిస్తామని చెప్పి గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు తమ వద్ద నుంచి రూ.2 వేల చొప్పున వసూలు చేసి మోసం చేశారని వాపోయారు. వారిపై చర్యలు తీసుకొని తమనకు న్యాయం చేయాలని సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు.

ప్రణాళికా బద్ధంగా పంటలు సాగు చేయాలి

వాంకిడి, సెప్టెంబర్ 26 : ఉద్యానవన పంటలు ప్రణాళికా సాగు చేయాలని బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త స్రవంతి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదికలో గిరిజన ఉప ప్రణాళికలో భాగంగా సమీకృత పంటల నిర్వహణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కూరగాయలు పంటలు పండించేటప్పుడు మొత్తం పంట ఒకే సారి వేయకుండా పది రోజుల కాల వ్యవధిలో వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో గోపికాంత్, ఏఈవోలు రాజేశ్వర్, శంకర్, కృష్ణ, మానస, పరిమళ, వెంకటేశ్, రైతులు ఉన్నారు.

తొలగించిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలి

దహెగాం, సెప్టెంబర్ 26 : నల్గొండ జిల్లా గుర్రపోడ్ మండలం ఎంపీడీవో, ఇద్దరు పంచాయతీ కార్యదర్శులను కలెక్టర్ సస్పెండ్ చేశారని, వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఎంపీడీవో రాజేందర్, పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షులు చౌదరి రాజేశ్ డిమాండ్ చేశారు. వారిని సస్పెండ్ చేసినందుకు గురువారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.

'రైతులకు న్యాయం జరిగేలా చూస్తా'

కౌటాల, సెప్టెంబర్ 26 : ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజనేతర రైతులకు న్యాయం జరిగేలా చూస్తానని ఎమ్మెల్సీ దండే విఠల్ అన్నారు. గురువారం మండలంలోని తలోడి గ్రామంలో రైతులతో ఆయన సమావేశమై మాట్లాడారు. మండలంలోని బండపాటి శివారులో తలోడి, గురుడుపేట, కన్నెపల్లి, కనికి ఇతర గ్రామాల రైతులకు భూములున్నాయని, వాటిని ఏళ్ల తరబడి సాగు చేస్తున్నప్పటికి వాటికి ఇప్పటి వరకు ఎలాంటి ఆధారాలు లేక ఇబ్బందులు పడుతున్నామని, తమకు న్యాయం చేయాలని రైతులు కోరారు. మంత్రి సీతక్క ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానన్నారు. అనంతరం కౌటాల పంచాయతీ కార్యాలయంలో చాకలి ఐలమ్మ జయంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించి క్రీడాకారులతో మాట్లాడారు. ఆయన వెంట జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ సిడం గణపతి, మాజీ ఎంపీపీలు విశ్వనాథ్, నానయ్య, గంగారాం, నాయకులు గంగారాం, తిరుపతి, రవీందర్ గౌడ్, గోపాల్, బాపు, తదితరులున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

సిర్పూర్(టీ), సెప్టెంబర్ 26 : సిర్పూర్(టీ) మండలంలో ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉమ్మడి అదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ అన్నారు. గురువారం మండలకేంద్రంలో పార్టీ ముఖ్య నేతలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి సమస్యలు తెలుసుకొని పరిష్కరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్మన్ సిడాం గణపతి, ఎల్ములే కిశోర్, సుహేల్ అహ్మద్, నర్గేవార్ రాజు, అఖిల్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

మహా ధర్నా విజయవంతం చేయాలి

కాగజ్‌నగర్, సెప్టెంబర్ 26: ఈ నెల 28న హైదరాబాద్ ఇందిరా పార్కులో నిర్వహిస్తున్న మహా ధర్నా విజయవంతం చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతి కుమారి స్పష్టం చేశారు. యూటీఎఫ్, గురుకుల జేఏసీ పిలుపు మేరకు గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె స్పష్టం చేశారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో టూరిజం క్లబ్ ఏర్పాటు

కాగజ్‌నగర్, సెప్టెంబర్ 26: కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యువ టూరిజం ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ శ్రీదేవి తెలిపారు. కాగజ్‌నగర్ పట్టణంలోని త్రిశూల్ పహాడ్‌పై ఉన్న ఆలయాల సముదాయాన్ని గురువారం విద్యార్థులు సందర్శించినట్లు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ కో ఆర్డినేటర్ జనార్దన్, అధ్యాపకులు లక్ష్మయ్య, శారద, రజిత, విద్యార్థులు పాల్గొన్నారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

ఆసిఫాబాద్ టౌన్,సెప్టెంబర్ 26: టాస్క్ ద్వారా నిర్వహించే మినీ జాబ్ మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని టాస్క్ రీజినల్ సెంటర్ మేనేజర్ సాయికుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అక్టోబర్ 1న జిల్లా కేంద్రంలోని టాస్క్ కార్యాలయం (పాత కలెక్టర్ భవనం) లో మినీ జాబ్ మేళా నిర్వహిస్తామని, జాబ్ మేళాను డిగ్రీ పూర్తి చేసి, వయసు 30 సంవత్సరాలలోపు ఉన్న నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

అనుమతులు లేని వెంచర్లపై చర్యలు

రెబ్బెన, సెప్టెంబర్ 26: ఎలాంటి అనుమతులు లేకుండా వెంచర్లు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవని రెబ్బెన తహసీల్దార్ రామ్మోహన్‌రావు హెచ్చరించారు. రెబ్బెన మండలం ఇందిరానగర్ గ్రామంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల పక్కన ఏర్పాటు చేసిన వెంచర్‌కు లే అవుట్ లేనందున జిల్లా ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు గురువారం పంచాయతీరాజ్, రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో స్తంభాలను తొలగించినట్లు తెలిపారు.

రెగ్యులర్ ఎంఈవోలను నియమించాలి

కాగజ్‌నగర్, సెప్టెంబర్ 26: ప్రతి మండలానికీ రెగ్యులర్ ఎంఈవోలను నియమించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి చాపిలే సాయికృష్ణ డిమాండ్ చేశారు. ఈ నెల 27న విద్యారంగా సమస్యలు పరిష్కరించాలని హైదరాబాద్ ఇందిరాపార్కులో నిర్వహించనున్న విద్యార్థి మహాగర్జన పోస్టర్లు గురువారం ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.

'రూమ్ టూ రీడ్' పోస్టర్ ఆవిష్కరణ

రెబ్బెన, సెప్టెంబర్ 26: రెబ్బెన మండల కేంద్రంలోని ఎమ్మార్సీలో గురువారం రూమ్ టూ రీడ్ స్వచ్ఛంద సంస్థ రూపొందించిన ఐదు రకాల పోస్టర్లను రెబ్బెన ఎంఈవో మోకార్తి వెంకటేశ్వర్, కాసిపేట మండల ఎంఈవో వెంకటేశ్వర్లస్వామితో కలిసి ఆవిష్కరించి, తెలుగు కథల పుస్తకాలను, స్టోరీ కార్డులను ఉపాధ్యాయులకు అందించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు ఉన్నారు.

'ప్రశస్త్'పై అవగాహన

వాంకిడి, సెప్టెంబర్ 26: విద్యార్థుల్లో ఆరోగ్య సమస్యలు, వైకల్యాలను కనిపెట్టి వారికి సరైన వైద్య చికిత్స చేసేందుకు ప్రశస్త్ యాప్ ఎంతో ఉపయోగపడుతుందని ఎంఈవో శివ చరణ్‌కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జడ్పీ పాఠశాలలో యాప్ నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం, ఐఈఆర్పీలు, సీఆర్పీలు పాల్గొన్నారు.